సాక్షి చిత్తూరు
మంగళవారం ¦ 30 ¦ జూలై ¦ 2024



ప్రజల వినతులకు ప్రాధాన్యం
ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. - 8లో



కంటిపాపపై పంటిగాట్లు
అభం శుభం తెలియని చిన్నారులను చిదిమేస్తున్న ఘటనలు జిల్లాలో చాప కింద నీరులా పాకుతున్న వైనంపై కథనం. - 8లో



ఫిర్యాదులపై విచారణ
ప్రజా ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. - 8లో

దండుకో.. పిండుకో..

చెలరేగి పోతున్న తమ్ముళ్లు



వరగలి క్రాస్ రోడ్డులో వెలసిన భారీ

అధికార పార్టీ నేతలు కొందరు దాదాగిరికి దిగుతున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని అడ్డదిడ్డంగా సంపాదించే పనిలోపడ్డారు. ఇందులో ముఖ్యంగా రియల్టర్లు, కాంట్రాక్టర్లు, వ్యాపారులపై దృష్టి సారించారు. వారిని బెదిరిస్తూ.. భయపెడుతూ భారీ ఎత్తున వసూళ్లకు తెగబడుతున్నారు. వారిని లొంగదీసుకునేందుకు తాము చెప్పేవరకు రిజిస్ట్రేషన్లు చేయొద్దంటూ సంబంధిత సబ్‌రిజిస్ట్రార్లకు హుకుం జారీచేస్తున్నారు. ఎవరైనా ఎదురు తిరిగినా.. ఫిర్యాదు చేసినా 'తలకాయలు' లేస్తాయంటూ హెచ్చరికలు జారీచేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొందరు అధికార పార్టీ నేతలు అడిగినంత సమర్పించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. తెరచాటున తిరుపతి, చిత్తూరు జిల్లాల వ్యాప్తంగా జరుగుతున్న ఈ వరుస ఘటనలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక.. ఎలా పరిష్కరించుకోవాలో అర్థంగాక పలువురు భయాందోళనలో మునిగిపోతున్నారు.

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో అధికార పార్టీ నేతల అరాచకాలు పెచ్చుమీరుతున్నాయి. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా.. అధికారం ఉన్నప్పుడే డబ్బు సంపాదించాలనే యావలో కొందరు నేతలు లీనమైపోతున్నారు. ఇందులో భాగంగానే దౌర్జన్యాలు.. దందాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. శ్రీకాళహస్తి, గూడూరు, తిరుపతి, పుంగనూరు పరిధిలో జరిగిన వరుస దౌర్జన్యాలు చూస్తుంటే వారి నిజ స్వరూపం ఏంటో అర్థమవుతోంది. అవేంటో మీరే ఓ లుక్కేయండి..

తవ్వేసి..మళ్లీ పూడ్చేసి

తిరుపతి జిల్లా, గూడూరు నియోజకవర్గం, చిల్లకూరు మండలం జాతీయ రహదారి వెంబడి పలు ప్రాంతాలలో లే అవుట్లు వెలుస్తున్నాయి. అందులో ఒకటి ప్రైవేటు వెంచర్. గత ఏడాది వరగలి క్రాస్ రోడ్డు ప్రాంతంలో పడమర వైపున జాతీయ రహదారి, దక్షిణం వైపు సాగరమాల రహదారి ఉండేలా నెల్లూరుకు చెందిన ఓ రియల్టర్ 48 ఎకరాలను కొనుగోలు చేసి వెంచర్ వేశారు. ఈ భూమిలో గూడూరు మండలం పోటుపాళెంకు చెందిన చెరువుకు సాగునీటిని అందించే ఒరవ కాలువ ఉండేది. యాజమాన్యం వద్ద భూమి కొనుగోలు చేసిన రియల్టర్ భవిష్యత్‌లో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ల్యాండ్ కన్వర్షన్ చేసుకునే సమయంలోనే రైతులతో చర్చించి పంట కాలువ అలైన్‌మెంట్‌ను మార్చుకుని సిమెంట్‌తో కాలువను నిర్మించి ప్లాట్ల విక్రయాలకు శ్రీకారం చుట్టారు. అదే సమయంలో ఎన్నికలు వచ్చాయి. ఆ తర్వాత అధికారంలోకి టీడీపీ రావడమే తరువాయి.. ఆ పార్టీకి చెందిన నాయకుడు ఆ వెంచర్‌లో ఉన్న లోటుపాట్లు తెలుసుకున్నారు. వెంటనే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి భారీ యంత్రాలతో కాలువను తవ్వి హద్దులు ఏర్పాటు చేసి అమ్మకాలకు ఆటంకం కలిగించారు. కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టిన వెంచర్ నిర్వాహకులు టీడీపీ నాయకుడిని కలిసి కన్నీరుపెట్టుకుని ప్రాధేయపడ్డారు. ప్లాట్ల అమ్మకాలు సజావుగా సాగాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని రియల్టర్ బతిమలాడినా వినలేదు. అమరావతిలో ఉన్న నాయకుడిని వెళ్లి కలిశారు. అక్కడ రియల్టర్‌కి చేదు అనుభవమే ఎదురైంది. చేసేది లేక వారు డిమాండ్ చేసిన మొత్తంలో రూ.2 కోట్లు అడ్వాన్స్ ఇచ్చినట్లు సమాచారం. మిగిలిన మొత్తం ప్లాట్ల అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తంలో నుంచి చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు గూడూరులో జోరుగా ప్రచారం జరుగుతోంది. డీల్ కుదిరాక తవ్వేసిన కాలువను అధికారులే పూడ్చివేసి ప్లాట్ల అమ్మకాలకు లైన్ క్లియర్ చేశారు.


కాలువను పూడ్చేసిన దృశ్యం


పంట కాలువ అలైన్‌మెంటు మార్చి నిర్మించిన సిమెంట్ కాలువ

పంట కాలువ యథాతథంగా మార్కింగ్ చేశాం

వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో వేసిన వెంచర్‌లో మధ్యలో పంట కాలువ ఉన్న మాట నిజం. అయితే వెంచర్ యజమానులు గతంలోనే పంట కాలువ అలైన్‌మెంట్ మార్చుకునేలా దరఖాస్తు చేసుకుని ఉన్నారు. అలాగే పోటుపాళెం రైతులతో మాట్లాడుకుని వెంచర్‌లోని ప్రాంతంలో సిమెంట్ కాలువను ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల అనంతరం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ద్వారా ఆ ప్రాంతంలో ఉన్న పంట కాలువను యథాతథంగా ఉండేలా మార్కింగ్ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో సర్వేయర్, వీఆర్‌ఓ, ఆర్‌ఐలు రికార్డులను పరిశీలించి వెంచర్‌లో ఉన్న పంట కాలువకు మార్కింగ్ ఇచ్చాం.

– తహసీల్దార్ శ్రీనివాసులు, చిల్లకూరు, తిరుపతి జిల్లా

అలైన్‌మెంటు మార్చేలా దరఖాస్తు చేసుకోలేదు

వరగలి క్రాస్ రోడ్డులోని వెంచర్‌లో ఉన్న పంట కాలువ అలైన్‌మెంటు మార్చుతున్నట్లు ఇరిగేషన్ శాఖకు వెంచర్ యాజమాన్యం ఎలాంటి దరఖాస్తు చేసుకోలేదు. పంట కాలువను పూడ్చి వేసి పక్కనే సిమెంట్ కాలువ కట్టి ఉన్నా తమ శాఖ అనుమతులు లేక పోవడంతో ఫిర్యాదులు వచ్చాయి. వెంచర్‌లో గతంలో ఉన్న పంట కాలువను యథాతథంగా తవ్వాం. ఆ తర్వాత ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రావడంతో కాలువను పూడ్చి వేశాం. ఇందులో ఎలాంటి ఒత్తిడీ లేదు.

– వెంకటసురేష్‌బాబు (ఏఈఈ, ఇరిగేషన్‌శాఖ, గూడూరు)

రిజిస్ట్రేషన్లు చేస్తే తాటతీస్తాం!

శ్రీకాళహస్తి పరిధిలో రేణిగుంట, శ్రీకాళహస్తి, తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రాయలసీమలోనే కీలకమైంది. ఈ కార్యాలయం నుంచి ఏటా ప్రభుత్వానికి రూ.150 కోట్లు ఆదాయం ఉంటుంది. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి, తిరుపతి విమానాశ్రయం కూడా ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉండడంతో భూములు, ప్లాట్లకు మంచి డిమాండ్ ఉంది. రియల్టర్లు కూడా ఎక్కువ మంది రేణిగుంట పరిధిలో భూములు కొనుగోలు చేసి లే అవుట్లు వేసి విక్రయిస్తుంటారు. అందులో భాగంగా రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్లాట్ల క్రయ, విక్రయదారులతో కిటకిటలాడుతుంటుంది. అదేవిధంగా శ్రీకాళహస్తి, తొట్టంబేడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోనూ ప్లాట్ల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నేత ఒకరు రియల్టర్లు, సబ్‌రిజిస్ట్రార్ల నుంచి మామూళ్లు రాబట్టడం కోసం స్కెచ్చేశారు. మామూళ్ల కోసం శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో రిజిస్ట్రేషన్లు ఆపేమయని అధికార పార్టీకి చెందిన నాయకుడు సబ్ రిజిస్ట్రార్ అధికారులకు ఫోన్‌చేసి హుకుం జారీ చేసినట్లు సమాచారం. తాను చెప్పే వరకు రిజిస్ట్రేషన్లు చేయకూడదని ఆదేశించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఈనెల 8వ తేదీ నుంచి శ్రీకాళహస్తి పరిధిలోని కొన్ని భూములు, అప్రూవల్, నాన్ అప్రూవల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్లు ఆపేశారు. ఎవరైనా ఒత్తిడి చేస్తే తన వద్దకు పంపమని సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. టీడీపీ నేత వద్దకు వెళ్లిన కొందరు రియల్టర్లను బెదిరించడం, వెంచర్ అక్రమం అంటూ భయపెడుతున్నట్లు తెలిసింది. తాను అడిగినంత ఇస్తే రిజిస్ట్రేషన్లకు ఎటువంటి అభ్యంతరం ఉండదని స్పష్టం చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న కొందరు రియల్టర్లు ఇదేం సంస్కృతి అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్రయ, విక్రయదారుల ఒత్తిడితో సబ్‌రిజిస్ట్రార్లు కార్యాలయానికి వెళ్లకుండా ముఖం చాటేస్తున్నారు. రెండు వారాలుగా ఇదే పరిస్థితి సాగుతోంది.



ఎవరికైనా చెప్తే 'తలకాయలు' ఉండవ్!

పుంగనూరు పరిధిలోని బోయకొండ గంగమ్మ అంటే ఉమ్మడి జిల్లాలో ప్రముఖశక్తి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఎక్కువ మంది పొట్టేళ్లు, మేకపోతులు, కోళ్లు అమ్మవారికి బలి ఇచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారు. వాటి తలకాయలను భక్తులు అమ్మవారికే అని విడిచిపెట్టేస్తుంటారు. అలా ప్రతి రోజూ భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటుంటారు. ఆ తలకాయల కోసం దేవస్థానం ఏటా వేలంపాట నిర్వహిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చిలో నిర్వహించిన వేలంపాటలో తలకాయలు, వాటి క్లీనింగ్, దుకాణాలను లక్షల రూపాయలు చెల్లించి పాడుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ నేతలు దౌర్జన్యంగా కాంట్రాక్ట్ లాక్కున్నారు. లక్షల రూపాయలు చెల్లించామని ప్రాధేయపడుతున్నా విడిచిపెట్టలేదు. ఆలయం వైపు రావద్దంటూ హుకుం జారీచేశారు. వారం పది రోజులుగా ఎటువంటి డబ్బులు చెల్లించకుండా టీడీపీ శ్రేణులే భక్తులు అమ్మవారికి మొక్కుల రూపంలో విడిచిపెట్టే తలకాయలను వారే స్వాధీనం చేసుకుని విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. అదేవిధంగా మిగిలిన టెండర్లను కూడా టీడీపీ శ్రేణులే బలవంతంగా లాక్కున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఫిర్యాదు చేస్తే 'మీ తలకాయలు ఉండవు' అని హెచ్చరించడంతో కాంట్రాక్టర్లు ఎవ్వరికీ ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

- బకాయిల వసూలుపై ప్రత్యేక శ్రద్ధ
- విద్యుత్ సమస్యలను 91333 31912కు వాట్సాప్ చేయొచ్చు
- సీఎండీ సంతోషరావు


ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంస్థ పరిధిలోని ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఫీడర్ ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్‌పై నిరంతరం సమీక్షిస్తూ పూర్తిస్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలందించేందుకు వీలుగా వాట్సాప్, చాట్ బోట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని, తద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం వుంటుందన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే వెంటనే సరిచేయాలన్నారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్లు 1912, 18004251553333కు కాల్ చేయాలని, చాట్ బోట్, 91333 31912 నంబరుకు వాట్సాప్ ద్వారా తెలపాలని కోరారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, పద్మ, సూపరింటెండింగ్ ఇంజినీర్లు సురేంద్ర నాయుడు, విజయన్, రమణ, ఉమాపతి, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హరోం హర 'వాహిని'



ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గుడుపల్లె మండలంలోని గుడివంక క్షేత్రం సోమవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. పశ్చిమ వాహిని కొండ హరోంహర నామస్మరణతో మార్మోగింది. శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి భక్తులు కావళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మరి కొందరు భక్తులు వీపునకు కొక్కీలు గుచ్చుకుని క్రేన్‌లకు వేలాడుతూ వచ్చారు. తేరు కావళ్లు.. రాగి గుండులు, ఇనుప శూలాలు, నిమ్మకాయలతో సూదులు శరీరానికి గుచ్చుకుని ఆలయం ఎదుట కావళ్లను చెల్లించారు.

– గుడుపల్లె

ప్రభుత్వ ఆస్పత్రికి నోటీసులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి విద్యుత్ శాఖ అధికారులు నోటీసులు పంపించారు. కరెంటు బిల్లు దాదాపు రూ.4 కోట్లు పెండింగ్‌లో ఉందని వాటిని కట్టాలని ఆదేశించారు. బిల్లును చెల్లించాలని అపోలో అధికారులకు తెలియజేసినా నిర్లక్ష్యంగా ఉండడంతో.. ఫలితం లేకుండా పోతోందని ట్రాన్స్‌కో అధికారులు విసిగిపోయి నోటీసులు పంపించారు.

మద్యం మత్తులో.. కూతురికే ఉరి

- కుమార్తె ఆత్మహత్య చేసుకుందంటూ నమ్మించే యత్నం చేసిన తండ్రి
- ఆ తరువాత పోలీసుల కళ్లుగప్పి ఉడాయించిన వైనం


గౌతమి (ఫైల్)

రొంపిచెర్ల : మద్యం మత్తులో ఓ తండ్రి కన్న బిడ్డనే ఉరేసి చంపిన సంఘటన మండలంలోని పెద్దమల్లెల గ్రామ పంచాయతీ నడింపల్లెలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మృతురాలు మేనమామ జయరాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నడింపల్లెకు చెందిన కె.మునిరత్నం(35), రెడ్డెమ్మ దంపతులకు ఒక కుమార్తె గౌతమి(14) ఉంది. పదేళ్ల క్రితం రెడ్డెమ్మ మృతి చెందారు. అప్పటి నుంచి గౌతమి తన తండ్రి, అవ్వతో కలసి ఉంటోంది. గౌతమి పెద్దమల్లెల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అయితే మునిరత్నం తల్లి ఐదు నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఆ ఇంట్లో తండ్రి, కుమార్తె జీవిస్తున్నారు. మునిరత్నం ఆదివారం రాత్రి తాగొచ్చి ఇంట్లో పడుకుని ఉన్న కుమార్తెను ఏమీ పని చేయడం లేదని మందలించాడు. దీంతో గౌతమి కూడా గట్టిగా బదులిచ్చింది. వెంటనే కోపంతో సెల్ చార్జింగ్ వైర్‌ను మెడకు వేసి చంపివేశాడు. ఎవరికి అనుమానం రాకుండా ఉరి వేసుకుని మృతి చెందిందంటూ ఉదయాన్నే చుట్టుపక్కల వారికి చెప్పాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులకు తండ్రి మీద అనుమానం రావడంతో తమదైన శైలిలో విచారించారు. దీంతో తన బిడ్డను చార్జింగ్ వైరుతో చంపివేసినట్లు ఒప్పుకున్నట్లు సమాచారం. ఆ క్రమంలోనే నిందితుడు మునిరత్నం పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. కల్లూరు సీఐ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎస్‌ఐ రవి ప్రకాష్ రెడ్డి, సంఘటన స్థలాన్ని సందర్శించి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం కోసం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితుడి మునిరత్నం కోసం రొంపిచెర్ల పోలీసులు గాలిస్తున్నారు. రెండు రోజుల్లో నిందితుడిని అరెస్టు చేస్తామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ఎన్నో అనుమానాలు

కుమార్తె గౌతమి మృతిపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గౌతమి తాను చనిపోతున్నానని తన చావుకు తన స్నేహితులను పిలవాలని రాసిన ఒక లేఖ సోమవారం బయటపడింది. అయితే మరోపక్క మునిరత్నమే తన కుమార్తెను చంపేశాడని ఒప్పుకున్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా తండ్రి కుమార్తెపై లైంగిక దాడికి యత్నించి, చంపేసి ఉంటాడని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికలో వాస్తవం బయట పడుతుందని భావిస్తున్నారు.

క్లుప్తంగా

సివిల్ సర్వే ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఈఆర్వో నూతన భవనానికి సంబంధించి సివిల్ సర్వేను సోమవారం ప్రారంభించారు. కార్యాలయం శిథిలావస్థకు చేరిందని నూతన భవనం అవసరమని ఈఈ మునిచంద్ర ఎస్‌ఈ సురేంద్రనాయుడుకు నివేదించారు. దీంతో సివిల్ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎస్‌ఈ ఆదేశించారు. భవనాన్ని పరిశీలించి కొలతలు తీసుకున్నారు. తదుపరి దశలవారీగా సర్వే ముగించి నివేదికను ఎస్‌ఈకు అందజేయనున్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ శ్రీనివాసులురెడ్డి, సివిల్ డీఈ జగదీశ్వర నాయుడు, డీఈ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక రేపు

చిత్తూరు కలెక్టరేట్ : కుప్పంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

▸ తిరుపతి జిల్లా నాయుడుపేట పరిధిలోని దొరవారిసత్రం ఎనిమిదేళ్ల బాలికను ఈనెల 17న కిడ్నాప్ చేశారు. ఇంట్లో ఆడుకుంటున్న బాలికను తీసుకెళ్లి, బాలికపై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో నిందితుడు ఎవరో కాదు.. బాలిక తండ్రికి స్నేహితుడే. తెలిసిన వ్యక్తే కావడంతో నమ్మి వెళ్లినందుకు ఈ దురాగతానికి పాల్పడ్డాడు.

▸ ఇటీవల చిత్తూరులో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు మైనర్ బాలికను నమ్మించి పనిలో పెట్టుకున్నాడు. నాలుగేళ్లుగా బాలికపై లైంగికదాడి చేస్తుండడంతో ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అప్పుడుగానీ తల్లిదండ్రులకు విషయం తెలియలేదు. ఆర్‌ఎంపీ వైద్యుడ్ని అరెస్టు చేసినా, జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఈ రెండు ఘటనల్లోనూ సాక్ష్యాధారాలు రుజువైతే నిందితులకు తప్పకుండా శిక్ష పడుతుంది. నేరం నిరూపణ కాకపోతే బయటకు వచ్చేస్తారు. కానీ చనిపోయిన ఎనిమిదేళ్ల బాలిక తిరిగిరాదు. నాలుగేళ్లుగా తనపై జరిగిన అఘాయిత్యానికి సాక్ష్యంగా ఉన్న బిడ్డతోపాటు తన భవిష్యత్తు ఎటువైపో తెలియని పరిస్థితి ఈ బాలికది. జిల్లాలో ఇటీవల వెలుగు చూసిన ఈ రెండు ఘటనలు చిన్న పిల్లలను దుష్టుల నుంచి ఎలా కాపాడుకోవాలో చెబుతూనే, తల్లిదండ్రుల బాధ్యతను గుర్తు చేస్తోంది.

కంటి'పాప'పై పంటిగాట్లు



కర్తవ్యం మరిచి కర్కశం

- వసివాడుతున్న పసి మొగ్గలు
- జిల్లాలో చాపకింద నీరులా అఘాయిత్యాలు
- వణికిపోతున్న ఆడబిడ్డల తల్లిదండ్రులు

కర్తవ్యం మరిచిన కొందరు కర్కశంగా మారుతున్నారు. దేవుళ్లుగా భావించే చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఏం చేసినా ఎదిరించలేరన్న కారణంతో పసి మొగ్గలను పట్టుకుంటున్నారు. అదును చూసి కాటేస్తున్నారు. ఏం జరుగుతోందో తెలియని కంటి'పాప'లు పంటిగాట్లతో విలవిల్లాడిపోతున్నారు. తెలిసినవాళ్లే చిరుతిండ్లు ఆశ చూపి చిదిమేస్తున్నారు. ఆకాశమే హద్దుగా ఎగరాల్సిన చిన్నారులు, రెక్కలు రాకమునుపే నేల రాలిపోతున్నారు. క్రూరమృగాల అఘాయిత్యాలకు ఆడ పిల్లలు బలైపోతున్నారు. ఇలాంటి దుస్సంఘటనలు జిల్లాలో చాప కింద నీరులా పాకుతుండడంతో తల్లిదండ్రులు చిగురుటాకుల్లా వణికిపోతున్నారు.

చిత్తూరు అర్బన్: మన చుట్టూ తిరుగుతున్న వాళ్లే, మనకు బాగా తెలిసినవాళ్లే.. మన కంటిపాపను పొడిచేస్తున్నారు. మాయమాటలు చెప్పో, లేనిపోనివి ఆశ చూపించో పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ఇటీవల ఈ దుర్మార్గపు ఘటనలు చాపకింద నీరులా పాకుతున్నాయి. జరగాల్సిన నష్టం జరిగిపోయాక.. పోలీసులు చర్యలు తీసుకున్నా ఆ తల్లిదండ్రులకు మిగిల్చిన శోకం ఎప్పటికీ తీరదు. ప్రధానంగా పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడే ఘటనల్లో నిందితులుగా ఉన్నవాళ్లు, బాధితులకు బాగా పరిచయమైన వాళ్లు, దగ్గరివాళ్లుగా ఉంటారు. తరచూ ఇంటికి వస్తూపోతూ ఉంటారు. అవసరంలేకున్నా పిల్లల్ని వక్ర బుద్ధితో తాకుతూ ఆనందించడం, ఆపై పిల్లల్ని ఒంటరిగా దుకాణాలకు తీసుకెళ్లి చిరుతిండ్లు కొనివ్వడం, మొబైల్‌ఫోన్లు చేతికి ఇవ్వడం అలవాటు చేస్తారు. తీరా ఓ రోజున ఎవరూ లేనిసమయం చూసుకుని, పిల్లలతో ఉన్న పరిచయంతో వాళ్లను తీసుకెళ్లి తన అసలైన క్రూరత్వాన్ని ప్రదర్శిస్తుంటారు. అందుకునే పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ఏదైనా భయానికి లోనైనపుడు, అసలు ఏం జరిగిందో పిల్లలు తల్లిదండ్రులు, టీచర్లకు చెప్పేంత భరోసా పిల్లలకు ఉండాలి. అంతటి స్వేచ్ఛా వాతావరణం లేనపుడు పిల్లలు తరచూ లైంగికదాడులకు గురయ్యే ప్రమాదం ఉంది.

తల్లిదండ్రులే కాపాడుకోవాలి

ఓ కోడిపెట్ట తన పిల్లల్ని కాపాడుకోవడానికి ఆకాశంలో ఎగిరే గద్దతో యుద్ధానికి దిగినట్లు.. కన్న పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుకోవడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. అసలు ఎవరిని ఇంటి వరకు రానివ్వాలి..? బయటి వ్యక్తులకు పిల్లలతో అతి చనువు పరిచయం అవసరమా..? పాఠశాలల వద్దకు పిల్లల్ని తీసుకురావడానికి ఎవరిని పంపాలి..? ఇలాంటి ప్రశ్నల్ని ఒకటికి రెండు మార్లు తల్లిదండ్రులు వాళ్లను వాళ్లే ప్రశ్నించుకుంటే పిల్లలపై జరిగే లైంగిక దాడుల్లో సగానికి పైగా ముందస్తుగానే నిరోధించే అవకాశం ఉంటుంది. దీనికి తోడు పరిచయం ఉన్న వారైనా, లేనివారైనా ఎలా మెలగాలో నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ఇక పాఠశాలలు, ఇంటర్ విద్య నేర్చుకునే పిల్లలకు గుడ్‌-బ్యాడ్ టచ్‌ను తప్పనిసరిగా నేర్పించాల్సిన అవసరం ఉపాధ్యాయులపై ఉంది. ఇప్పటికే పలు పాఠశాలల్లో దీనిపై ఓ బొమ్మ సాయంతో వివరిస్తున్నారు. అయితే కొన్ని విద్యా సంస్థల్లో ప్రాథమిక విద్యను అభ్యసించే వాళ్లకు దీనిగురించి అవసరం లేదని, కొందరు ఉపాధ్యాయులు మిన్నకుండిపోతున్నారు. ఇది సరైన నిర్ణయం కాదు. లైంగిక దాడులకు గురయ్యే పిల్లల్లో ఎక్కువ మంది పదేళ్లలోపు ఉండడమే దీనికి కారణం.

పిల్లలతో రోజూ మాట్లాడండి



తల్లిదండ్రులకు ఎన్ని పనులున్నా ప్రతిరోజూ పిల్లల్ని దగ్గరకు తీసుకుని కాసేపు మాట్లాడాలి. ఎవరితో ఎలా మెలగాలనే విషయం తప్పకుండా చెప్పాలి. నాకు ఏదైనా ఇబ్బంది వస్తే మా తల్లిదండ్రులకు చెప్పొచ్చు అనే ధైర్యం పిల్లల్లో కల్పించాల్సింది తల్లిదండ్రులే. దీని తరువాత ఉపాధ్యాయులు ప్రధాన భూమిక పోషించాలి. గుడ్‌-బ్యాడ్ టచ్ చెప్పడం, సమాజంలో జరిగే దురాగతాల పట్ల ఎలా జాగ్రత్తగా ఉండాలి? అనేది చెప్పాలి. పిల్లలపై జరిగే లైంగికదాడులను ముందస్తుగా నివారించడానికి పోలీసుశాఖ కూడా చైతన్యం తీసుకొస్తోంది. విద్యా సంస్థల్లో మా వాళ్లు వెళ్లి పిల్లలకు, ఉపాధ్యాయులకు దీనిపై అవగాహన కల్పిస్తున్నారు.

– మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు.

పీఎఫ్ ఇవ్వకుంటే ప్రత్యక్ష కార్యాచరణ



సీఈఓ గ్లోరియాకు విన్నవిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ ఇవ్వకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని యూటీఎఫ్ నాయకులు తెలిపారు. జెడ్పీలో సోమవారం సీఈఓ గ్లోరియాను కలిసి వినతి పత్రం అందజేశారు. పీఎఫ్ సైట్‌ను అప్‌డేట్ చేయాలని ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. నెలవారీగా ఎంత మొత్తం చెల్లిస్తున్నారు తదితర వివరాలు లేవన్నారు. పూర్తి స్థాయిలో ప్రదర్శనకు ఉంచి వడ్డీలను జమ చేయాలని కోరారు. ఇటీవల మరణించిన ఉపాధ్యాయ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధించి పురోగతి లేనందున క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు ఖాతాల నిర్వహణపై అనుమానాలు ఉన్నాయని తెలిపారు. గతంలో పలుమార్లు విన్నవించినా, ఎటువంటి స్పందన లేనందున ఆగస్టు చివరి నాటికి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణ, సోమశేఖర్ నాయుడు, మణి గండన్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల వసూలు రూ.1.47 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో ఆదివారం సెలవు రోజున విద్యుత్ బిల్లులు చెల్లించే అవకాశం కల్పించిచడంతో అన్ని బిల్లింగ్ కేంద్రాల వద్ద 25,300 మంది వినియోగదారులు కరెంటు బిల్లులు చెల్లించారని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. తద్వారా మొత్తం రూ1.47 కోట్లు వసూలైందని చెప్పారు.

డాయ్ బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

పలమనేరు: డాయ్ యాప్ అక్రమాలపై విచారణ కోసం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా పీడీ రాధమ్మ ఆధ్వర్యంలో కమిటీ బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఆ మేరకు 224 మంది ఫిర్యాదు చేయగా, వీరి మోసపోయిన మొత్తం రూ.4.70 కోట్లుగా లెక్కగట్టారు. వీరిలో ఓ వ్యక్తే కోటి రూపాయలు పోగొట్టుకోవడం విశేషం. నేటి సాయంత్రం వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందుకు కారణమైన మెప్మా ఆర్‌పీలపై సైతం చర్యలుంటాయని పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు ఫిర్యాదు చేస్తున్న డాయ్ బాధితులు

ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల ఫిర్యాదుపై వేదికలో వచ్చిన వాటిని క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు అధికారులను ఆదేశించారు. స్థానిక ఏఆర్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో 31 ఫిర్యాదులు రాగా, మోసం, కుటుంబ తగాదాలు, భూ వివాదాలు, వేధింపులు, ఆర్థిక – ఆస్తి లావాదేవీలకు సంబంధించి ఉన్నాయి. గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదును నిర్దేశిత గడువులోపు విచారించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఏఎస్పీ ఆరీఫుల్లా, మహిళా స్టేషన్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సైతం ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు.



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చెక్కు అందజేత

పాలసముద్రం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఈనెల 26న మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ జయప్రకాష్ కుటుంబానికి ఎస్పీ రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందజేశారు. సోమవారం మృతుడి భార్య రెడ్డి రాధాకు ఐడీఆర్‌ఎఫ్ ఫండ్ నుంచి ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఏఎస్పీ ఆరీఫుల్లా, పోలీసు సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హత ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి, నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్(ఎన్‌ఎఫ్‌టీడబ్ల్యూ) అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ దేవరాజు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని జెడ్పీ, సాంఘీక సంక్షేమ, ఎయిడెడ్, మున్సిపల్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత బడుల్లో పనిచేస్తున్న టీచర్లు అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు (మూడు సెట్లు) ఆగస్టు 5వ తేదీ లోపు ఎంఈఓలకు, డీవైఈవోలకు అందజేయాలని తెలిపారు. వారు పరిశీలించి నివేదికలను ఆగస్టు 10 లోపు డీఈవో కార్యాలయానికి తప్పనిసరిగా పంపాలని ఆదేశించారు.

అర్హతలు ఇలా..

- కనీసం 15 ఏళ్ల బోధన అనుభవం ఉండాలి.
- రాష్ట్ర స్థాయి దరఖాస్తులు చేసుకునే వారు గతంలో జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి.
- గతంలో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న వారు అనర్హులు.
- దరఖాస్తు చేసుకునే టీచర్‌పై ఎటువంటి క్రిమినల్, ఆర్టికల్ ఆఫ్ చార్జెస్, శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు ఉండకూడదు.
- జాతీయ స్థాయి అవార్డుకు దరఖాస్తు చేసిన వారు ప్రస్తుతం రాష్ట్ర స్థాయి అవార్డుకు దరఖాస్తు చేసుకోకూడదు.

సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఏర్పేడు: శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని నూతన విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో నూతన విద్యార్థులు, తల్లిదండ్రులతో సమగ్ర ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఓరియంటేషన్ కార్యక్రమం విద్యార్థుల కోసం కొత్త విద్యాప్రయాణానికి నాంది అని పేర్కొన్నారు. నూతన విద్యా సంవత్సరానికి గాను బీటెక్, ఎంటెక్, మాస్టర్ ఇన్ పబ్లిక్ పాలసీ, ఎంఎస్‌బై రీసెర్చ్, పీహెచ్‌డీ ప్రోగ్రాంలలో కొత్తగా విద్యార్థులు చేరినట్లు వివరించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులతో ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహించారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ కేఎన్‌సత్యనారాయణ

ప్రజల వినతులకు అధిక ప్రాధాన్యం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ప్రజల వినతులకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందజేసే వినతులను అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ప్రతి సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నమోదయ్యే అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు 113 అర్జీలు అందజేశారని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల వేదికలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

ఇవే సమస్యలు

నన్ను మళ్లీ బతికించండి

ప్రభుత్వ రికార్డుల్లో తనను చంపేశారని, మళ్లీ బతికించాలని తవణంపల్లె మండలం పైమాఘం గ్రామానికి చెందిన బాధితుడు ఆంజనేయులు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ మానసిక ఆరోగ్యంతో 2019 లో తాను ఇంటి నుంచి వెళ్లిపోయానని చెప్పారు. నాలుగేళ్లు కడపలోని ఓ ఆశ్రమంలో చికిత్స చేసుకున్నట్లు తెలిపారు. అయితే 2020లో తన పోలికలతో ఉన్న వ్యక్తి మరణించగా, ఆయన్ను తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించేశారని చెప్పారు. తాను మృతి చెందినట్లుగా మరణ ధృవీకరణపత్రం ఇచ్చేశారని తెలిపారు. 2023 ఏప్రిల్‌లో తాను తిరిగి ఇంటికి రాగా అసలు నిజం తెలిసిందన్నారు. అధికారులు దయవుంచి ప్రభుత్వ రికార్డుల్లో తనను తిరిగి బతికించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

లంచం తీసుకుని సర్వీసు ఇచ్చారు

తన పేరుపై ఉన్న కరెంటు సర్వీసును లంచం తీసుకుని మరొకరికి ఇచ్చారని సోమల మండలానికి చెందిన బాధితురాలు శాంతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు లంచం తీసుకుని తన సర్వీసును ఇతరులకు ఇచ్చారని, విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.

కిడ్నీ మార్పిడికి సాయం చేయండి

కిడ్నీ మార్పునకు ప్రభుత్వం తరఫున సహాయం అందించాలని పూతలపట్టు మండలం జెట్టిపల్లెకు చెందిన రాము ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తాము కూలి చేసుకుని జీవనం కొనసాగిస్తున్నామని చెప్పారు. తనకు రెండు కిడ్నీలు పాడైనట్లు తెలిపారు. తన భార్య ఒక కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. కిడ్నీ మార్పునకు సహాయం అందించాలని కోరారు.

సంబంధం లేని కేసులో ఇరికించారు

తమకు సంబంధం లేని కేసులు పోలీసులు ఇరికించారయ్యా అంటూ సదుం మండలం ఎర్రాతివారిపల్లెకు చెందిన బాధితురాలు మంజుల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు తన బాధను విన్నవించుకున్నారు. ఆమె మాట్లాడుతూ తాము ఎస్సీ కుటుంబానికి చెందిన వారమని చెప్పారు. వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తుంటామని తెలిపారు. తమ కుటుంబానికి రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేదన్నారు. తన భర్త మణిని పోలీసులు సంబంధం లేని కేసులో అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించి తన కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె కోరారు.

లింగనిర్ధారణ పరీక్షలు నేరం

లింగనిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి గర్భస్థ శిశులింగ నిర్ధారణ, మాతాశిశు మరణాల నిర్మూలనపై పీసీపీఎన్‌డీటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా లింగ వివక్ష జరుగుతున్నట్లు బాధితులు, కుటుంబ సభ్యులు తగు ఆధారాలతో తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. పోలీసులు, ఐసీడీఎస్, ఎన్జీఓలు వేర్వేరుగా తనిఖీలు చేయాలని సూచించారు. ఆశా, అంగన్వాడీలు, ఏఎన్‌ఎంలు అవగాహన కార్యక్రమంలో కీలకపాత్ర పోషించాలని తెలిపారు. డీఎంహెచ్‌ఓ (చిత్తూరు డివిజన్), డీఐఓ (పలమనేరు డివిజన్), అడిషనల్ డీఎంహెచ్‌ఓ (కుప్పం, నగరి డివిజన్)పరిధిలోని అన్ని పీహెచ్‌సీలను, అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాలను పరిశీలించి చట్టం అమలుపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ హనుమంతరావు, డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ కీర్తన, తదితరులు పాల్గొన్నారు.